ఆటోనగర్‌కు మహర్దశ!


వడ్లపూడి రైల్వే క్యాబిన్ వద్ద నిర్మించిన రైల్వే బ్రిడ్జి

- వట్టాలెక్కిన అభివృద్ధి పనులు
- ఆర్‌వోబీ పనులు చకచకా
- శరవేగంగా అండర్ కేబుల్ పనులు
- ప్రధాన రహదారి విస్తరణ, బ్యూటిఫికేషన్‌కు సన్నద్ధం
- హర్షం వ్యక్తం చేస్తున్న పారిశ్రామిక వేత్తలు

రాష్ట్రంలోనే అతిపెద్ద ఐలాగా గాజువాక ఆటోనగర్ విస్తరించి ఉంది. పది బ్లాకులతో ఎంతో ప్రాచుర్యం పొందింది. అలాంటి ప్రాంతంలో ప్రధానమైన మూడు పనులకు మార్గం సుగమం అయింది. దీంతో పనులు ఊపందుకున్నాయి. ఆటోనగర్‌లోని పారిశ్రామిక వేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులు, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణం చకచకా సాగుతున్నాయి. ఇక ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి సెయిల్ వరకు ప్రధాన రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి . ఈ మూడు పనులు పూర్తయితే ఆటోనగర్‌కు మహర్దశే అని పారిశ్రామిక వేత్తలు అంటున్నారు.

– అక్కిరెడ్డిపాలెం

విద్యుత్ వైర్లు భూమిలోనే..


ఎఫ్ - బ్లాక్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులు

పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో ఇక బహిరంగంగా విద్యుత్ వైర్లు కనిపించవు. ఏపీఈపీడీసీఎల్ సుమారు రూ.680 కోట్ల వ్యయంతో అన్ని బ్లాకుల్లో 54 కిలోమీటర్ల మేర 33 కేవీ, 11 కేవీ అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులు ప్రారంభించింది. విశాఖపట్నంలో ప్రధాన ప్రాంతాల్లో హుద్‌హుద్ సమయంలో అప్పట్లో అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులు చేపట్టారు. తాజాగా ఆటోనగర్‌లో అన్ని బ్లాకుల్లో అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో పరిశ్రమలకు విద్యుత్ సమస్య తీరినట్లేనని పారిశ్రామిక వేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే విపత్తుల సమయంలో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండదని అధికారులు తెలిపారు.

త్వరలో బ్యూటిఫికేషన్ పనులు

ఆటోనగర్‌కు చేరుకునే ప్రధాన రహదారి ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. దీనిపై పలు మార్లు ఐలా ప్రతినిధులు ఎంఎస్ఎంఈకు, ఐలాకు ప్రతిపాదనలు పంపారు. ఎట్టకేలకు ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి సెయిల్ వరకు నూతన రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తి చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా ఆక్రమణలను తొలగించి ఇరువైపులా 7 మీటర్లు, మధ్యలో మీటర్ డివైడర్ ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలు, లైటింగ్ ఏర్పాటు చేసి బ్యూటిఫికేషన్ చేస్తారని ఐలా ప్రతినిధులు తెలిపారు.


విస్తరించనున్న ఆటోనగర్ ప్రధాన రహదారి

చకచకా ఆర్‌వోబీ నిర్మాణ పనులు


ఇరువైపులా అనుసంధానం కోసం చేపడుతున్న పనులు

దశాబ్దకాలం నుంచి కలగానే మిగిలి పోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు చకచకా సాగుతోంది. ఈ ప్రాంతంలో గూడ్స్ రైలు రాకపోకల సమయంలో గేటు పడితే చాలు ఇరువైపులా వాహనాలు వేచి ఉండే పరిస్థితి. ఉద్యోగాలకు వెళ్లే వారు, విద్యార్థులు, పరిశ్రమలకు వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. రూ.13.92 కోట్ల వ్యయంతో సుమారు 661 మీటర్ల పొడవుతో ఆర్‌వోబీ పనులు ప్రారంభమయ్యాయి. ఆటోనగర్‌లోని చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీ వద్ద నుంచి ఎఫ్ - బ్లాక్ వైపు ఆర్‌వోబీకు గత ఐలా కమిటీ ప్రతిపాదనలు చేపట్టింది. ఎనిమిది సంవత్సరాల కిందట వడ్లపూడి రైల్వే క్యాబిన్ వద్ద రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మించారు. అప్పటి నుంచి ఇరువైపులా మిగిలిన పనులు చేపట్టకపోవడంతో పరిశ్రమలకు వచ్చే వాహనాలతో పాటు ఇరువైపులా సుమారు 20 గ్రామాల ప్రజల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం నిధులు మంజూరవ్వడంతో ఆర్‌వోబీ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో పారిశ్రామిక వేత్తలతో పాటు ఇరువైపుల గ్రామాలకు చెందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పనులను పర్యవేక్షిస్తున్నాం



ఆర్‌వోబీ, అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నాం. త్వరలో ప్రారంభం కానునున్న ప్రధాన రోడ్డు నిర్మాణంపై కూడా ఒక ప్రణాళిక సిద్ధం చేశాం. ఆర్‌వోబీ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. పనులు పూర్తయితే ఆటోనగర్‌కు చాలా కష్టాలు తీరినట్లే.

– ఎ.కిషోర్, ఆటోనగర్ ఐలా కమిషనర్

పెండింగ్ పనులకు మోక్షం



ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఆర్‌వోబీ, ప్రధాన రహదారి పనులకు మార్గం సుగమం అయింది. ఐలా కమిటీ ప్రారంభమైప్పటి నుంచి ప్రధానమైన సమస్యలు పరిష్కరించాలని ఎంఎస్ఎంఈతో పాటు ఏపీఐఐసీ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. పారిశ్రామిక వేత్తల సమష్టి కృషితో పనులు ప్రారంభమయ్యాయి.

– కె.సత్యనారాయణ రెడ్డి , ఆటోనగర్, ఐలా చైర్మన్

ఆనందంలో పారిశ్రామిక వేత్తలు



ఆటోనగర్‌లో ప్రధాన రహదారి పనులు, ఆర్‌వోబీ పనులు, అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులు పూర్తయితే పరిశ్రమలకు ఎంతో మేలు జరుగుతుంది. ఆర్‌వోబీ అందుబాటులోకి వస్తే ఇరువైపులా ఉన్న పరిశ్రమలతో పాటు ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఆయా పరిశ్రమలకు వచ్చే వాహనాలు ఆటంకం లేకుండా చేరుతాయి. పనులు వేగంగా సాగడంతో పారిశ్రామిక వేత్తల్లో ఆనందం కలుగుతుంది.

– సజ్జా పాండురంగ ప్రసాద్, వాసీవా అధ్యక్షుడు

అధినేతతో ఆత్మీయ కలయిక


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి

గాజువాక: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆ పార్టీ గాజువాక నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు తాడేపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి కొద్దిసేపు ముచ్చటించారు.

- పెందుర్తి మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కూడా జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన అధినేతను శాలువాతో సత్కరించారు.భవిష్యత్ కార్యాచరణపై సూచనలు చేశారని గురుమూర్తిరెడ్డి పేర్కొన్నారు.

స్టీల్‌క్లబ్‌లో మానసిక ఉల్లాస కార్యక్రమాలు


మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు మధుసూదనరావు

ఉక్కునగరం: స్టీల్‌క్లబ్ సభ్యుల మానసిక ఉల్లాసం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని స్టీల్‌క్లబ్ అధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ ఎం. మధుసూదనరావు చెప్పారు. క్లబ్ కార్యాలయంలో బుధవారం నూతన కార్యవర్గం చేయబోయే కార్యక్రమాలను ఆయన వివరించారు. 800 మంది సభ్యులున్న ఈ క్లబ్‌కు ప్రతీ సభ్యుడు నెలకు రూ. 130 చెల్లిస్తారన్నారు. దాంతో క్లబ్ నిర్వహణ కొంత కష్టంగానే ఉంటుందన్నారు. క్లబ్ ఆడిటోరియం, ఆవరణను ఇతరుల కార్యక్రమాలకు ఇవ్వడం ద్వారా క్లబ్ నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ మాట్లాడుతూ క్లబ్ పరిసరాలను అభివృద్ధి చేయడంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సభ్యుల మన్ననలు పొందుతామన్నారు. సంయుక్త కార్యదర్శి వై. రవికుమార్, కోశాధికారి డి. వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు పి.ఆర్.ఎస్. సాయిరవి, కె. రంగనాథం, మళ్ల వెంకటరాజు, బి. వెంకటరమణ, జె. రమేష్ కుమార్, ఏడీఈ రమేష్, వి. నాగభూషణరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


విద్యార్థితో మంటలను నివారిస్తున్న కోరమాండల్ ఫైర్ అండ్ సేఫ్టీ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం కోరమండల్ సంస్థ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో భద్రత వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కోరమాండల్ ఫైర్ అండ్ సెఫ్టీ అధికారులు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలా నివారించాలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని కీలలు ఎగసిపడుతున్నప్పుడు ఆర్పేక్రమంలో సిలెండర్స్‌ను ఎలా ఉపయోగించాలి అనే దానిపై విద్యార్థులతో స్వయంగా మాక్ డ్రిల్ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, కోరమాండల్ అధికారులు లోకేష్, కె.కార్తీక్, పి.నాగార్జున, డి.ఛాంది, సీఎస్ఆర్ ప్రతినిధులు ఎస్.వెంకటరమణ, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా



పతకం అందుకుంటున్న సన్యాసిరావు

ఉక్కునగరం: జాతీయ మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో జనరల్ ఫోర్‌మెన్ సన్యాసిరావు పతకాలు గెలుపొందారు. ఇటీవల హర్యానాలోని పంచుకులాలో యోనెక్స్-సన్‌రైజ్ ఆల్ ఇండియా మాస్టర్స్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సన్యాసిరావు ప్రతిభ కనబరిచి పురుషుల డబుల్స్ (55+)లో బంగారు పతకం, సింగిల్స్‌లో రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆయన్ను స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు అభినందించారు.

విద్యార్థులకు అపారమైన అవకాశాలు


మాట్లాడుతున్న అతిథి

అగనంపూడి: ప్రపంచీకరణ అన్ని రంగాలతో పాటు విద్యారంగంపై ఎక్కువగా ఉందని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. విదేశీ ఉన్నత విద్యావకాశాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడారు. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకొనే వారు వీసా, స్కాలర్‌షిప్‌లు, ప్రవేశ విధానం, అక్కడ గల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తదితర అంశాలను వివరించారు. విశాఖ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ మాట్లాడుతూ విదేశాల్లో విద్యనభ్యసించాలనే విద్యార్థులకు కావాల్సిన సమాచారం, సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్ ఎస్.ఎం. మురళీకృష్ణ, డీన్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అగనంపూడి: కేబీఆర్ ఫీడర్‌లోని 33 కేవీ సబ్ స్టేషన్‌లో నిర్వాహణ పనుల కారణంగా శుక్రవారం అగనంపూడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అగనంపూడి సెక్షన్ కార్యాలయ ఏఈ లక్ష్మణరావు తెలిపారు. అగనంపూడి, శనివాడ, కేఎస్ఎన్‌రెడ్డినగర్, శాంతినగర్, గుళ్లవానిపాలెం, జాబిలీహిల్స్, దువ్వాడ, లక్కరాజుపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్పీల వినతి


ఆర్పీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రుద్దు చేయాలని జీవీఎంసీ మెప్మా ఆర్పీలు కోరారు. నగర వ్యాప్తంగా పని చేస్తున్న ఆర్పీలు మెప్మా, ఆర్పీ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో పాతగాజువాకలోని టీడీపీ కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. పలు సమస్యలను ఆయనకు నివేదించారు. తొలగిస్తామంటూ కొంతమంది కార్పొరేటర్లు ఆర్పీలకు స్వయంగా ఫోన్ చేసి చెబుతున్నారని పేర్కొన్నారు. రూపాయి జీతం లేనప్పుడు గ్రూపులను ఏర్పాటు చేసి పని చేశామని, ఇప్పుడు జీతం వచ్చేసరికి తమను తొలగించాలని చూడడం అన్యాయమని వాపోయారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి ప్రతిపాదనలేవీ లేవని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్పీ ఉద్యోగుల సంఘం నేతలు మళ్లీశ్వరి, రఘూన్సీ, సీహెచ్.సత్యవరలక్ష్మి, ధనలక్ష్మి, రత్నాలు పాల్గొన్నారు.

లైంగిక దాడులు అరికట్టడంలో పాలకులు విఫలం


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

గాజువాక: మహిళలు, యువతులు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక దాడులను అరికట్టడంలో పాలకపక్షాలు విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి అన్నారు. మహిళలపై లైంగిక దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం గాజువాకలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్యలో మహిళపై అత్యాచారం జరిగిన సంఘటనపై విచారణ జరిపి దోషులను శిక్షించకపోవడం దుర్మార్గమన్నారు. ఆ సంఘటనను ప్రజలు మరువకముందే విశాఖ నగరంలోని హెచ్‌బీ కాలనీలో బాలికపై దాడి జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మహిళలపై లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు పిల్లా పద్మ, దేవుడమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



చిన్నారుల ప్రతిభను తల్లిదండ్రులకు వివరిస్తున్న సూపర్‌వైజర్ సుజాత

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ, బాల్య, దశ సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) డే కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులకు చిన్నారుల ప్రతిభను సూపర్‌వైజర్ సుజాత వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2030 నాటికి దేశవ్యాప్తంగా నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ అందరికీ అందించడమే ఈసీసీఈ డే లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎల్ అండ్ డీసీ విభాగం సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. అగనంపూడి కొత్తూరు కాలనీకి చెందిన బొబ్బరి కనకరావు స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్-3లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 3న రాత్రి కనకారావు విధులు ముగించుకుని బైక్‌పై కూర్మన్నపాలెంలోని తన కుమార్తె ఇంటికి వెళ్తున్నాడు. ఎల్ అండ్ డీసీ విభాగం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కనకరావును కూర్మన్నపాలెంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అతని కుమారుడు అప్పలరాజుకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

పెదగంట్యాడ: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని న్యూపోర్టు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌కు చెందిన కరణ్ మెహర్ (22) గంగవరం పోర్టులో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మరో పక్క గంజాయి విక్రయిస్తున్నాడు. నెల్లిముక్కు కుంచుమాంబ ఆలయ సమీపంలో ఓ యువకుడు గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో న్యూపోర్టు పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు.అతని వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి


స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు


భెల్ ప్రధాన గేటు వద్ద నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న జి.టి.పి.ప్రకాష్

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు బుధవారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు, కార్యకర్తలు కోడ్‌లను ఉపసంహరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇప్పటి వరకు ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కోడ్‌లు ప్రవేశ పెట్టడం వల్ల కార్మికులు బానిసలుగా మారుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కొత్త కోడ్‌లను రద్దు చేయకపోతే కార్మిక వర్గం ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, యు. రామస్వామి, వై.టి.దాస్, రమణమూర్తి ,జి. గణపతిరెడ్డి, దొమ్మేటి అప్పారావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం భెల్ (హెచ్‌పీవీపీ) ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సీతంనాయుడు, ఎస్. జగన్నాథరావు, కొల్లి దేముడు, వారాడ ఆనందరావు పాల్గొన్నారు.

- లేబర్ కోడ్స్ రద్దు చేయాలని విశాఖ డెయిరీ వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. సీఐటీయూ నాయకుడు ఎం.రాంబాబు, విశాఖ డెయిరీ యూనియన్ అధ్యక్షుడు ఎస్.రమణ, మణిబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పెదగంట్యాడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద బుధవారం నిరసన చేపట్టారు. కార్మిక చట్టాలను రద్దు చేసి బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా కార్మిక కోడ్లను తీసుకువచ్చే ప్రయత్నం సరికాదన్నారు.

ఇలాగే వదిలేస్తారా!

అగనంపూడి: జాతీయ రహదారిలో కూర్మన్నపాలెం కూడలి నుంచి రాజీవ్‌నగర్ కూడలి వరకు ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ కేబుళ్ల అమర్చే పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. దీంతో వాహనచోదకులు బేజారెత్తుతున్నారు. ఆరేళ్ల కిందట జీవీఎంసీ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసింది. తర్వాత కేబుళ్లకు రక్షణగా అమర్చిన పైప్‌లైన్ డివైడర్‌ను ఆనుకొని అమర్చినప్పటికీ కేబుల్ ఎక్కడికక్కడే తెగిపోవడంతో మూడు రోజుల నుంచి కేబుళ్ల పునః ఏర్పాటు పనులు ప్రారంభించారు. డివైడర్‌ను ఆనుకొని తవ్వుతూ పాత వాటిని తొలగిస్తూ కొత్తవి అమర్చుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా తవ్విన తారు పిక్కను పూర్తిగా కప్పివేయకుండా సగం సగం పనులతో మమా అనిపిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు పొరపాటున వాటిపై నుంచి వెళ్తే ప్రమాదలబారిన పడే అవకాశం ఉందని వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షణ కొరవడడం వల్లే ఇలా అస్తవ్యస్తంగా కేబుల్ పైప్‌లైన్ కప్పే పనులు చేపి చేతులు దులుపేసుకుంటున్నారని అంటున్నారు. మరోపక్క రహదారి విస్తరణ పనులు మధ్యలో నిలిచిపోవడం, ఇలా పనులు చిందరవందరగా వదిలేస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


సెంట్రల్ లైటింగ్ కేబుళ్ల అమర్చే పనిలో తవ్వి సగం మాత్రమే కప్పుతున్న దృశ్యం

వాసుదేవ శర్మకు తెలుగు వెలుగు పురస్కారం


వాసుదేవ శర్మకు పురస్కారం అందజేస్తున్న మండలి బుద్ధ ప్రసాద్

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు బంకుపల్లి వాసుదేవ శర్మకు తెలుగు వెలుగు పురస్కారం లభించింది. తెలుగు వెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇటీవల స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యా ఉపాసకుడు బంకుపల్లి వాసుదేవ శర్మకు డిప్యూటీ మాజీ స్పీకర్ చేతుల మీదుగా తెలుగు వెలుగు పురస్కారం ప్రదానం చేశారు.